www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 4 ఫిబ్రవరి 2023
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



పోలీసులు బెదిరిస్తున్నారంటూ ఆవేదన

ఐ.పోలవరం : ఒఎన్‌జిసి పైపులైను పనులను అడ్డుకోవడంతో తమను పోలీసులు బెదిరిస్తున్నారని గోగులంక గ్రామ పంచాయతీలు పరిధిలోని బైరవలంక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గ్రామ పెద్దలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని ఒఎన్‌జిసి పనులకు ఆటంకం కల్పిస్తే కేసులు పెడతామని ఎస్‌ఐ సిహెచ్.రాజేష్ హెచ్చరించారని వారు వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించేవరకూ పైపులైను నిర్మాణం చేపట్టరాదని మహిళలు అడ్డుకున్నారు. ఈ ఆందోళన సమయంలో పోలీసులు ఫొటోలు తీసుకున్నారని వారు తెలిపారు. ఫొటోలు ఆధారంగా తమను బెదిరిస్తున్నారని కూరాటి బాగిర్తమ్మ, విరగాలమ్మ, దాసరి రఘుపతమ్మ, ఉండ్రు సూరమ్మ, నాగమణి, మామేటి లక్ష్మి తదితరులు తెలిపారు. దీనిపై ఎస్‌ఐ సిహెచ్.రాజేష్‌ను వివరణ కోరగా తాను ఎవరినీ బెదిరించట్లేదన్నారు. ఒఎన్‌జిసి పనులకు ఇబ్బంది కలిగించొద్దు అని చెప్పాం తప్ప ఎవరినీ బెదిరించలేదని తెలిపారు.

విదేశీ విద్యా దీవెనతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - అమలాపురం

విదేశీ విద్యా దీవెనతో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడం గొప్ప సువర్ణ అవకాశమని, తద్వారా ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. శుక్రవారం తాడేపల్లి నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన కార్యక్రమం మొదటి విడత నిధులను సిఎం జగన్ వర్చువల్ విధానంలో విడుదల చేశారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొని మాట్లాడారు. విదేశాల్లోని అత్యున్నత శ్రేణి యూనివర్సిటీల్లో చదవాలంటే రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు ఫీజులు, ఇతరత్రా ఖర్చులు ఉంటాయన్నారు. ఇంత డబ్బు చెల్లించలేక ఎందరో ప్రతిభావంతులు ఈ అవకాశాలను వదులుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకంలో అందే స్కాలర్ ద్వారా అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో ఉచితంగా ఉన్నత విద్యను పూర్తి చేసుకునే సువర్ణ వకాశం పేద విద్యార్థులకు దక్కుతోందన్నారు. కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి రూ.8 లక్షల్లోపు ఉన్న వారు ఈ విదేశీ విద్యా దీవెనకు అర్హులని ఆయన స్పష్టం చేశారు. కోనసీమ జిల్లాలో ముగ్గురు విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెనకు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఇబిసి కేటగిరిలో కరుటూరి తనూజవెంకటసత్యశ్రీధర్ యుఎస్‌ఎలో చదువుకునేందుకు మొదటి విడతగా రూ.5,99,097 బిసి బి కేటగిరిలో రామచంద్రపురం మండలం తాళ్ల పొలానికి చెందిన బేతమూడి నిరోషా దేవికి యుకెలో చదువుకునేందుకు మొదటి విడతగా రూ.7,54,740 రూపాయలు, ఒసి కేటగిరిలో మట్ట సాయిఫణిరవిరామనాయుడుకు యుఎస్‌ఎలో పీజీ కోర్సు కోసం రూ.6,02,600 జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ శాఖ కార్యనిర్వాహక అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

అక్రమ అరెస్టులు అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - అమలాపురం

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు చేస్తున్న దీక్షలకు సిపిఎం పూర్తి మద్దతును ఇస్తుందన్నారు. సిపిఎస్‌ను రద్దు కోసం 18 ఏళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారన్నారు. అధికారంలోకి రాకముందు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తానని జగన్ స్పష్టంగా హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక మడమ తిప్పి జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. జిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ప్రశాంతంగా సంకల్ప దీక్షలు నిర్వహించకుండా ఎక్కడికక్కడ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అరెస్టులు చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలతో చర్చలు జరపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : కృష్ణవేణి

మండపేట : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి అన్నారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ చేపట్టిన సంకల్ప దీక్షకు బయలుదేరిన ఉపాధ్యాయలను అరెస్టు చేయడం, నిర్బంధించడం, నోటీసులు ఇవ్వడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అధికారంలోకి రాగానే సిపిఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక దాన్ని సిఎం జగన్ దాన్ని బుట్ట దాఖలు చేశారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన దీక్షను చేపట్టిన నేతలను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయన్నారు. ఇప్పటికైనా దిగొచ్చి సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. మండపేటలో పి.రామచంద్రారెడ్డి, కె.సూర్యప్రకాష్, ఎస్.సత్తిబాబు, ఎం.శ్రీనివాసులకు నోటీసులు జారీ చేయగా మరో ఆరుగురిని విజయవాడ సమీపంలో పోలీసులు అరెస్టు చేశరన్నారు.

అరెస్టులు అమానుషం

ఆలమూరు : సిపిఎస్ రద్దు కోసం చేపట్టి దీక్షకు వెళ్తున్న యుటిఎఫ్ నాయకులు అరెస్టు చేయడం, ముందస్తు నోటీసులు ఇవ్వడం అమానుషమని మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ఖండించారు. యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాలకు ఆయన సంఘీభావం తెలిపారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి - అమలాపురం

బడి ఈడు ఉన్న పిల్లలు తప్పకుండా ఏదొక పాఠశాలలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఎంఇఒలు, హెచ్‌ఎంలతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఇఒ ఎన్‌వి.రవిసాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు విషయాలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని అంశాల పట్ల ఎంఇఒలు, హెచ్‌ఎంలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులతో సహా ఎంఇఒలు సెక్టోరియల్ అధికారులు పాఠశాలల్లో తరచుగా తనిఖీ చేయాలన్నారు. తనిఖీ సమయంలో ఉపాధ్యాయులు వర్క్ బుక్స్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ కరెక్షన్స్ ఎలా చేస్తున్నారనే విషయాన్ని గమనించాలన్నారు. అదేవిధంగా సిలబస్ సకాలంలో పూర్తి చేస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్‌తో బై జ్యూస్ కంటెంట్‌ను తప్పనిసరిగా వినియోగించే విధంగా చూడాలన్నారు. ప్రతిరోజు కనీసం ఒక గంట పాటు బైజుస్ టాబ్స్ వాడే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు నేడు పనులను సకాలంలో చేపట్టాలని సూచించారు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి షాలెం రాజు, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.రమణశ్రీ, డిసిఇబి సెక్రటరీ బి.హనుమంతరావు, సిఎంఒ బివివివి.సుబ్రహ్మణ్యం, ఎఎంఒ పి.రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి బివివి.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి మధుసూదన్‌రావు



రత్నశ్రీ, రాంబాబు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

ఉప సర్పంచ్‌గా రత్నశ్రీ ఏకగ్రీవంగా ఎన్నిక

ప్రజాశక్తి- అమలాపురం(అల్లవరం)

అల్లవరం పంచాయతీ ఉప సర్పంచ్‌గా దాసం రత్నశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఎలక్షన్ అధికారి వి.స్పర్జన్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. రెండవ వార్డు సభ్యులైన మామిడిశెట్టి శ్రీసత్యనారాయణ రత్నశ్రీ పేరును ప్రతిపాదించగా 14వ వార్డు సభ్యులు తాడి సుమంత్ బలపరిచారు. మిగిలిన వార్డు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మి బాలవేణి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజమోహన్ పాల్గొన్నారు అనంతరం రత్నశ్రీ, రాంబాబు దంపతులను వైసిపి మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ, మెరికెల శ్రీను గ్రామ పెద్దలు, నాయకులు పూలమాలలతో సత్కరించారు.

హరీష్ నియామకంతో ఉత్సాహం

ప్రజాశక్తి - అంబాజీపేట

పి.గన్నవరం నియోజకవర్గం టిడిపి కో-ఆర్డినేటర్‌గా యువకుడైన గంటి హరీష్‌మాథూర్ నియామకం పట్ల యువతలో ఉత్సాహం నెలకొంది. అమలాపురంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అంబాజపేట ఎఎంసి మాజీ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు టిడిపి శ్రేణులు కలసి పుష్పగుచ్ఛం అందించారు. పదవి లేకపోయినా మూడేళ్ల నుంచి దీర్ఘ కాల సమస్యలు పరిష్కారం కోసం నిధులు మంజూరు కోరుతూ సంబంధిత కేంద్ర మంత్రులను కలసి సమస్యలు విన్నవించామన్నారు. బాలయోగి వారసునిగా ఆయన ఆశయ సాధనకు కషి చేస్తారని ఈ సందర్భంగా టిడిపి శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ టిడిపి నాయకులు వక్కలంక బుల్లియ్య, మండల ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి, గంగుమళ్ళ వీరభద్రరావు, మాచవరం గ్రామ అధ్యక్షులు దొమ్మేటి శ్యామ్, మందపాటి కిరణ్‌కుమార్, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, చిన్నం విజయారావు, బొంతు పెదబాబు, రవణం రాము, మందా రాజేష్, నేదునూరి రాజేష్ కుమార్ తదితరులు కలసి అభినందనలు తెలిపారు.



మాథూర్‌కు అభినందనలు తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



లోకేష్‌తో శ్రీనివాస్

లోకేష్ యాత్రతో వైసిపిలో వణుకు

ప్రజాశక్తి - రాజోలు

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో వైసిపి వెన్నులో వణుకు పుట్టిస్తోందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు. నాలుగు రోజులుగా లోకేష్ వెంట పాదయాత్రలో పాల్గొంటున్న శ్రీనివాస్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. అడుగడుగునా వైసిపి ప్రభుత్వం ఆటంకాలు కలిగించాలని చూస్తున్నా లోకేష్ పాదయాత్ర దిగ్విజయంగా ముందుకు సాగుతోందన్నారు. ఎక్కడ చూసినా జనం తండోపతండాలుగా తరలివస్తున్నారన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ యాత్రకు వస్తున్నారన్నారన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు లోకేష్ పాదయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పీడిత, తాడిత వర్గాల ఆక్రందనలు వింటూ, ఆవేదనను పంచుకుంటూ వారిని ఆదుకుంటామని భరోసా ఇస్తూ లోకేష్ ముందుకు సాగుతున్నారని చెప్పారు. హంగూ, ఆర్భాటాలకు దూరంగా ప్రజలతో మమేకం కావడమే లక్ష్యంగా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో లోకేష్ పాదయాత్ర సరికొత్త అధ్యాయం అవుతుందని శ్రీనివాస్ చెప్పారు.

వాస్తవ వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - అమలాపురం

వాస్తవ వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. విజవాడు పిఐబి ఆధ్వర్యంలో అమలాపురంలో శుక్రవారం పాత్రికేయులతో 'వార్తాలాప్' ఒకరోజు వర్క్ షాప్‌ను నిర్వహించారు. దీనికి రెడ్డి సత్యనాగేంద్రమణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ప్రజలకు చేరవేయడం లో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నేర పరిశోధనలో కేసుల పరిష్కారానికి మీడియా సహకారం ఎంతో విలువైందన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరక్టర్ జిడి.హల్లీకేరి మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వం చేసే పనులకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా ప్రజలకు, పత్రికలకు చేరవేసే సమాచార మాధ్యమంగా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విధులు నిర్వహిస్తోందన్నారు. సంచలనాలకు తావులేకుండా సమాచారాన్ని సూటిగా తెలియజేయడమే ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో బాధ్యతగా స్వీకరించిందన్నారు. మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా నాలుగో స్తంభంగా ఎనలేని పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఐసిడిఎస్ పీడీ సత్యవేణి, డిఆర్‌డిఎ పీడీ శివశంకరప్రసాద్, ఎపీడీ జిలానీ, డిపిఆర్‌ఒ లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి

ఎరువుల దుకాణలపై విజిలెన్స్ దాడులు

అమలాపురం : విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌బి.బాగ్చి ఆదేశాల మేరకు ఎస్‌పి పివి.రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. అమలాపురం పట్టణంలోని శివ శక్తి ఎంటర్ ప్రైజస్‌లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్ నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించారు. ఎక్కువ ధరకు అమ్మకాలు నిర్వహించడంతో 6ఎ కేసు నమోదు చేశారు. రూ.71,671 విలువ గల 2.645 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. ఈ షాపులో ఫాక్ట్ కంపెనీ ఎరువుల గరిష్ఠ అమ్మకపు ధర రూ.1,390 ఉండగా రూ.1,400 అమ్మినట్టు గుర్తించారు. శివ శక్తి ఓం ట్రేడర్స్‌కు వాస్తవ ఎరువుల సరఫరాదారులైన శ్రీ కోదండరామ ఫెర్టిలైజర్స్‌లో స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి వలీ, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 69 మందికి ఉద్యోగాలు

కాట్రేనికోన : మండలంలోని చెయ్యేరులో గల శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 69 మంది ఉద్యోగాలు పొందారు. ఎస్‌ఎల్‌ఎపి, కియా సంస్థకు చెందిన ఎ.ఆనంద్‌భాస్కర్, అశ్వథా ప్రతినిధుల బందం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సబ్జెక్టుల్లో విశ్లేషణ సామర్థ్యం, విషయ పరిజ్ఞానాన్ని ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. అందులో ప్రావీణ్యం కనబర్చిన విద్యార్థులకు మౌఖిక పరీక్ష నిర్వహించారు. నియామకపత్రాలు అందుకున్న వారిని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.రత్నరాజు, పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్‌రాజు, టిపిఒ బి.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డులతో సేవలకు గుర్తింపు

ఆలమూరు : సేవలకు గుర్తింపుగా అవార్డులు నిలుస్తాయని ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. చెముడులంక శ్రీకష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన తమ్మన శ్రీనివాస్‌ను శుక్రవారం ఆయన సత్కరించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడారు. 1998లో చెముడులంక గ్రామం పంచాయతీగా ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎందరో ప్రజా ప్రతినిధులు అధికారులు సేవ చేసినా ఎవరికీ ఈ అరుదైన గౌరవం దక్కలేదన్నారు. చెముడులంక గ్రామ ప్రజల ఆశీర్వాదాలతో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. పంచాయతీ సెక్రెటరీ యు.రేణుక, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పారిశుధ్య కార్మికుల సమిష్టి కృషికి ఈ అవార్డు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, వైసిపి నేతలు కె.నాగిరెడ్డి, నామాల శ్రీనివాస్, యనమదల నాగేశ్వరరావు, చల్లా పద్మ, ఎంపిడిఒ జాన్ లింకన్, కార్యదర్శి రేణుక పాల్గొన్నారు.

టిడిపి లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షునిగా జోగేష్



అయినవిల్లి : టిడిపి లీగల్ సెల్ పి.గన్నవరం నియోజక వర్గ అధ్యక్షునిగా బడుగు భాస్కర్‌జోగేష్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు రెడ్డి అనంతకుమారి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నియామక పత్రాన్ని టిడిపి మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, టిడిపి ప్రధాన కార్యదర్శి కుడుపూడి బుజ్జి శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. ప్రముఖ న్యాయవాది, సీనియర్ నాయకునిగా జోగేష్ కొనసాగుతున్నారు. గతంలో లీగల్ సెల్ మండల అధ్యక్షునిగా కొనసాగారు. కార్యకర్తలందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఉన్నత విద్యావంతుడిగా పార్టీలో అందరితోనూ సత్సంబంధాలు కలిగి ఉన్నారు. ప్రస్తుతం పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఎ అభ్యర్థిత్వానికి ఆశావహునిగా ఉన్నారు.

కార్టూ'నిజం'



సమీక్షల్లో మాట్లాడిన విషయాలు కూడా టాపింగ్ అయ్యాయి సార్..!!

డ్రెయినేజీ ఆక్రమణ

మండపేట : స్థానిక మారేడుబాక వంతెన సమీపంలో ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు కూడలి వద్దనున్న డ్రెయిన్‌ను ఆక్రమించి షెడ్డు వేయడంతో పాటు సొంతంగా రోడ్డుపైనే పైపు వేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో భారీ వాహనాలు మలుపు తిరిగేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు అంటున్నారు. ఈ డ్రెయినేజీపై మున్సిపల్ అధికారులు బల్లలు వేయడంతో పాదచారులు దీనిపై నడిచి వెళుతుంటారు. ఆక్రమణతో పాదచారులతోపాటు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రోడ్డు పనులకు ఈ ఆక్రమణ ఆటంకంగా మారిందని పలువురు అంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి మంజులను వివరణ కోరగా డ్రెయినేజీ ఆక్రమణ విషయంలో తానేమీ చేయలేనని తెలిపారు. ఈ విషయంపై కమిషనర్‌తో మాట్లాడాలని చెప్పారు.




డ్రెయినేజీపై అక్రమంగా వేసిన షెడ్డు

సమిష్టిగా పనిచేయాలి : ఎంఎల్‌ఎ చిర్ల

ఆలమూరు : వైసిపి విజయమే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని కన్వీనర్లు, వాలంటీర్లకు ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. శుక్రవారం కొత్తూరు సెంటర్‌లోని కల్యాణ మండపంలో మండల బూత్ లెవెల్ కన్వీనర్ నామాల శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో గ్రామ సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. సిఎం జగన్ ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. జరిగిన అభివద్ధిని వారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సచివాలయానికి వైసిపి పార్టీ తరపున ముగ్గురు కన్వీనర్లు ఉంటారన్నారు. సచివాలయాలకు ఎంపిక చేసిన పార్టీ కన్వీనర్లు కూడా గడప గడపకూ తిరగాలని కన్వీనర్ నామాల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జడ్‌పిటిసి సభ్యులు తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపిపి దుర్గాభవాని, నేతలు తోరాటి రాంబాబు, నెక్కంటి వెంకటరాయుడు (బుజ్జి), రావాడ సత్తిబాబు, నాతి కుమార్ రాజా, వనుం జార్జిబాబు పాల్గొన్నారు.

ఎ.వేమవరప్పాడులో ఫ్యామిలీ ఫిజీషియన్

అమలాపురం రూరల్ : ఎ.వేమవరప్పాడు సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ పందిరి విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ పేరిట అన్ని గ్రామాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టుగా ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యులు పలువురికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, హెల్త్ సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పి, హెల్త్ సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



జార్జ్ పాఫప్ నియామకంపై హర్షం

అంబాజీపేట : ప్రధానమంత్రి (న్యూ) 15 పాయింట్స్ ప్రోగ్రాం కమిటీ మెంబర్‌గా జార్జి పాఫప్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులను డిస్టిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్ ద్వారా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిహెచ్ మందిరంలో ఆయన్ని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి పినిపే, ఎంపీ అనురాధ, ఎంఎల్‌శ్రీ చిట్టిబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిషప్ ఎ.ప్రసాద్, డాక్టర్ వి.రాజ్‌కుమార్, ఎన్.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 124 మంది ఎంపిక

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన జాబ్ మేళాలలో 124 మంది ఎంపికయ్యారు. ఈ మేళాను ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ప్రారంభించారు. 12 కంపెనీలు ఈ మేళాలో పాల్గొన్నాయి. 367 మంది హాజరవ్వగా 124 మందిని ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోలా గంగాభవాని, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జడ్‌పిటిసి సభ్యులు కె.శివశంకరరావు, కె.బాలమునికుమారి, జగతా బాబ్జి, బి.సత్యశ్రీనివాస్, వైస్ ఎంపిపి పాము నాగమణి, ఎంపిడిఒ ఎఎన్.శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, విస్తరణాధికారి కె.పద్మజ్యోతి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు తదితరులు పల్గొన్నారు.

వేగంగా బైపాస్ రోడ్డు పనులు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక రాజారత్న సెంటర్ నుంచి మారేడుబాక వంతెన వరకు ఉన్న ఇందిరా గాంధీ బైపాస్ రోడ్డు అభివద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.93 కోట్లతో ఈ పనులను చేపట్టారు. గతంలో 4.30 మీటర్లు ఉన్న ఈ రోడ్డును సుమారు కిలోమీటర్ పాటు ఏడు మీటర్లకు విస్తరించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం పనులు చేపట్టింది. ఈ రోడ్డు వినియోగంలోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని పట్టణ ప్రజలు, వాహనదారులు తెలిపారు.

రాయుడుపాలెంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ రాయడువారి పాలెం సచివాలయం పరిధిలో బొక్కవారి పాలెం, టిటిఆర్ నగర్‌లో ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిడీ ప్రవీణ్ కుమార్, ఎంపిపి, జడ్‌పిటిసిలు, సర్పంచ్, అధికారులు, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

'పాలనలో కొరవడిన క్రమ శిక్షణ'

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో క్రమశిక్షణ కొరవడిందని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టటమే వైసిపి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యంగా ఉందన్నారు. ప్రజలపై పగతో పాలన సాగిస్తున్నారా అన్నట్లుగా పాలన ఉందన్నారు. గతంలో పేదల కోసం ఎన్‌టిఆర్ ప్రభుత్వం బియ్యం పథకం పెడితే ఆ పథకాన్ని వైసిపి ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యం మాత్రమే ఇచ్చి, అవి రాష్ట్ర ప్రభుత్వమే పంపిణీ చేస్తుందని గొప్పలు చెప్పుకుంటుందని ఆరోపించారు. కిలో రూపాయి బియ్యం ఎత్తివేయడం అంటే పేదలను ఆకలితో మాడ్చడమేనన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత బియ్యంతో పాటు కిలో రూపాయి బియ్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-రావులపాలెం

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం దేవరపల్లి శివారు మట్టలదొడ్డికి చెందిన సుమారు 50 కుటుంబాల వారు టిడిపిలో చేరారు. వీరికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఆనయ మాట్లడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టిడిపై నమ్మకంతో పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుబ్బల వెంకటరమణ, దేవరపల్లి గ్రామ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో యువకునికి జైలు

ప్రజాశక్తి - అమలాపురం

బైకుల చోరీ కేసులో యువకునికి రెండేళ్ల జైలు, రూ.వెయి జరిమానా విధిస్తూ జడ్జి కె.దీప్తిదైవకృప శుక్రవారం తీర్పునిచ్చారని ఎసిపి ఎస్.శివప్రసాద్ తెలిపారు. అమలాపురం చెందిన గండేటి నరసింహ (20) మూడు ప్రాంతాల్లో మూడు బైకులు దొంగిలించాడన్నారు. ఈ కేసుల్లో నరసింహను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. నేరం రుజువు కావడంతో రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, 1,000 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారన్నారు. పిపి వి.శ్రీరాములు వాదనలు వినిపించారన్నారు. హెడ్ కానిస్టేబుల్ జి.ప్రభాకర్ కేసులో సహకరించారన్నారు.

రైలు కిందపడి హెచ్ఎం ఆత్మహత్య

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు నవపాలెం రైల్వే స్టేషన్ మధ్యలో శుక్రవారం నిడదవోలు రాయిపేటకు చెందిన హెచ్ఎం వి.శ్రీనివాసరావు (56) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు నిడదవోలు జిఆర్‌పి హెచ్‌సి డి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు చెన్నాయిగూడెం స్కూల్లో హెడ్మాస్టర్‌గా పని చేస్తున్నారని, ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. ఆ బాధను తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నారు.

పాస్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తి దాడి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద బ్రహ్మదేవంలోని పాస్టర్ ఒగు విలియమ్స్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి కొడవలితో దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయాల పాలయ్యారు. సామర్లకోట పోలీసుల కథనం ప్రకారం పెద్దబ్రహ్మదేవం లోని మంచినీటి చెరువు వద్ద గల చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్న విలియమ్స్ గురువారం రాత్రి ఇంట్లో నిద్రపోతుండగా రాత్రి ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మంకీ క్యాప్ ముసుగు ధరించుకుని గోడ దూకి వచ్చి కొడవలితో దాడికి పాల్పడ్డాడు. విలియమ్స్ పెద్దగా కేకలు పెట్టడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. ఈ దాడిలో విలియమ్స్ కాళ్లకు, చేతులకు, ముఖానికి రక్తపు గాయాలు కాగా అతనిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సామర్లకోట పోలీసులు పాస్టర్ నివాసం ఉంటున్న చర్చి, ఇంటి పరిసర ప్రాంతాలను, సిసిటీవీ పుటేజీలను పోలీసులు పరిశీలించారు. పాస్టర్ విలియమ్స్ భార్య, కుమార్తె ఒరిస్సాలో ఉంటుండగా కుమారుడు ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. విలియమ్స్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

చినకొండేపూడిలో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని బిక్కవోలు మండలం ఆర్‌.ఎస్.పేట గ్రామానికి చెందిన ధనుంజయ సూరి సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. చినకొండేపూడిలో వర్కుగా సిటీలో ఉన్న ఇంటివద్ద పార్కు చేసిన హీరో స్ప్లెండర్ బైకును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారు. సీతానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమర్థవంతంగా సేవలందించాలి

- సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం పరిశీలనలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమాచార వారధిగా సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా విభాగం సమర్థవంతమైన సేవలు అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక రామారావు పేట కేసురిరావు వీధిలోని కాకినాడ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని డిఐపిఆర్‌ఓ, కాకినాడ కార్యాలయం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్న విధానం, ఇందుకు వివిధ సమాచార మాధ్యమాలతో ఏర్పరచుకున్న సమన్వయం గురించి ఆయన ఆ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మీడియా సంస్థల ప్రోత్సాహం, జర్నలిస్టుల సంక్షేమం కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటిని జిల్లాలో అమలు చేస్తున్న తీరును, మీడియా రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులు, తదనుగుణంగా ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందించే దుకు చేపడుతున్న విధానాలు, అవాంఛిత పోకడలను నిరోధించేందుకు అనుసరిస్తున్న వైఖరులు గురించి డివిజనల్ పిఆర్‌ఓ పి.రవి ఆయనకు వివరించారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేసి, వాటిని లక్షిత వర్గాల ప్రజలు సమగ్రంగా సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన వారిని కోరారు.కార్యక్రమంలో పిఆర్‌ఓలు కె.రవి, ఎఐఓ, ఎపి సూపరింటెండెంట్ ధర్మరాజు, ఎఐఓ సిద్దాంతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా సమాచార కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎసి ప్రఖర్ జైన్



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో అజిత్‌కుమార్, నీరజ్‌కుమార్, సుగుణారెడ్డి

ఆదిత్యలో అదిత్ -2కె 23 ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ మేనేజ్మెంట్ స్కూల్ ఆధ్వర్యంలో అదిత్-2కె23 కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వి.డి.ఎం వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య అజిత్‌కుమార్, రాక్ సెరా మిక్స్ హెచ్‌ఆర్‌హెడ్ టి.నీరజ్‌కుమార్‌లు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుగుణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అద్దం పట్టే విధంగా ఈ అదిత్ 2కె23 లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెటింగ్, ఫైనాన్స్, మానవ వనరులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి లతో పాటు ప్రశంసా పత్రాలను అందజేయనున్నట్లు ఆమె తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గల 25 బిజినెస్ కళాశాలల కు చెందిన 450 విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక నత్యాలతో స్వాగత కార్యక్రమం, ఏర్పాటుచేసిన స్టాల్స్ ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం.గోవర్దన్ రెడ్డి, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య టెక్నికల్ హబ్ 7వ వార్షికోత్సవం

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలోటెక్నికల్ హబ్ ప్రారంభించి నేటికి 7 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా టెక్నికల్ హబ్ టీమ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టెక్నికల్ హబ్ సిఇఒ బాబ్జి నీలం టెక్నికల్ హబ్ ప్రస్థానం గురించి వివరించారు. ముఖ్య అతిథిగా ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి మాట్లాడుతూ 2016లో ప్రారంభించిన ఈ టెక్నికల్ హబ్ నేడు 40 శాతంపైగా విద్యార్థులకు ఎంతో ఉత్సాహంతో నమ్మకంతో శిక్షణ అందించి, 31.31 లక్షల అత్యుత్తమ వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించే విధంగా తర్ఫీదు ఇచ్చామన్నారు. శిక్షణ అందిస్తున్న టెక్నికల్ హబ్ సిబ్బందికి, విద్యార్థులకు, తల్లితండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదిత్య ఛైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ నేటి తరాలకు బంగారు భవిష్యత్తును అందిస్తున్న టెక్నికల్ హబ్ సీఈవో నీలం బాబ్జికి ప్రత్యేక అభినందనలు తెలిపారు అనంతరం టెక్నికల్ హబ్ లో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన సిబ్బందికి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్ సుబ్రహ్మణ్యం, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె. రవిశంకర్, డి. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టెక్నికల్ హబ్ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వైస్ ఛైర్మన్ సతీష్ రెడ్డి

ధనబాబు మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి విలేకర్లు

దళిత నాయకుడు, లిబరేషన్ జిల్లా కార్యదర్శి సభ్యుడు మసకపల్లి ధనబాబు (41) ఆకస్మిక మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ధనబాబు పేదల ఇళ్ల స్థలాల సాధన, దళిత, గిరిజన సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా అనేక పోరాటాల్లో స్వయంగా పాల్గొన్నారని వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాతపాటి సోమరాజు, సిఐటియు నాయకులు పిల్ల రాంబాబు, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి నైనాలశెట్టి మూర్తి, కేంద్ర కమిటీ సభ్యులు బుగతా బంగార్రావు, జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చబాబు, ఐప్వా నాయకులు కాకర కుమారి మతురి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.


వినియోగదారుల చట్టాలపై అవగాహన

పెద్దాపురం : పెద్దాపురం మండలం వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దాపురం మండలం ఆర్ బి కొత్తూరు సచివాలయంలో వినియోగ దారులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సంఘం అధ్యక్షులు భట్టిమూడి సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రభుత్వం సరఫరా చేసిన వినియోగదారుల అవగాహన మ్యాగజైన్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే వినియోగదారులు పూర్తిస్థాయిలో న్యాయం పొందగలుగుతారన్నారు. ఈ సందర్భంగా ఆయన చట్టాల గురించి వివరించారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి జే పద్మరాజు, సచివాలయ కె.సురేఖ, సంఘ కార్యదర్శి ఎం భాస్కరరావు, కెవివి లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

సామర్లకోట వైస్ ఎంపిపి-1గా పేర్నీడి ఏకగ్రీవం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మొదటి వైస్ ఎంపిపిగా గొంచాల వైసిపి ఎంపిటిసి పేర్నీడి వెంకటరాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల మొదటి వైస్ ఎంపిపి వికెరాయపురం-2 ఎంపిటిసి మలిరెడ్డి సూర్యావతి ఆకస్మిక మరణంతో ఈ ఎన్నికను నిర్వహించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మంది రంలో పెద్దాపురం ఆర్‌డిఒ జె.సీతారామారావు ప్రిసైడింగ్ అధికారిగా ఎన్నికను నిర్వహించారు. వైస్ ఎంపిపి-1 పదవికి వైసిపి తరఫున ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో రిటర్నింగ్ అధికారి ప్రసాద్ ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. మండల మొదటి ఉపాధ్యక్షులుగా గొంచాల గ్రామ ఎంపిటిసి పేర్నీడి వెంకట రాయుడు అభ్యర్థిత్వాన్ని మాధవ పట్నం-2 ఎంపిటిసి మేడిశెట్టి దుర్గాదేవి ప్రతిపాదించగా, పెద్ద బ్రహ్మదేవం-1 ఎంపిటిసి మలకల సూర్యారావు బలపరచడంతో ఎన్నికను ఖరారు చేశారు. నూతనంగా ఎన్నికైన మండల ప్రజా పరిషత్ మొదటి ఉపా ధ్యక్షులు వెంకట రాయుడును సామర్లకోట జెడ్‌పిటిసి ఎలిశెట్టి అమృత నరేష్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విప్పర్తి వీర సాయిబాబు, పలువురు ఎంపిటిసిలు, కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపిగా ధ్రువీకరణ పత్రాన్ని పొందిన అనం తరం పేర్నీడి వెంకట రాయుడు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, పెద్దాపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జి దవులూరి దొరబాబును మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలుపగా దొరబాబు ఆయనను అభినందించారు.



వైస్ ఎంపిపి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పేర్నీడి వెంకటరాయుడు

కళాతపస్వి మృతికి సంతాపం

ప్రజాశక్తి - పెద్దాపురం

కళా తపస్వి కె.విశ్వనాథ్ మతికి పెద్దాపురం మండల ప్రజానాట్య మండలి కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ సంగీతం, ఉత్తమ సాహిత్యం, ఉత్తమ విలువలతో కూడిన ఆణి ముత్యాలు లాంటి సినిమాలను తీసిన ఆయన సినీ పరిశ్రమలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కేదారి నాగు, మండల అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్తిబాబు, రొంగల వీర్రాజు, సీనియర్ కళాకారులు దారపు రెడ్డి కృష్ణదొరపు రెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, కూనిరెడ్డి అప్పన్న తదితరులు ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో 14 మందికి గాయాలు

ప్రజాశక్తి - కోటనందూరు, గోపాలపురం

కోటనందూరు బిసికాలనీ, కోట,గోపాలపురం కొండగూడెంలో పిచ్చికుక్కలు దాడి చేసి 14 మందిని గాయపర్చాయి. జోగా గోవిందమ్మ, బొంగు ముసలయ్య, ముమ్మల వేణమ్మ, అచ్యుత స్వామి, గొర్ల శ్రావణితో పాటు మరి కొందరిని కోటనందూరు పిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అనంతరం తుని ఏరియా ఆసుపత్రిలో చేర్చారు. బాధితులను సర్పంచ్ జిగటల వీరబాబు ఎంపిటిసి మాజీద్రాం రావు పరామర్శించారు. బోగిశెట్టి ఏసుకృష్ణ, కోలా సత్యవతి, పఠాన్ సత్తార్, మీసాల సత్యనారాయణ గోపాలపురం పిహెచ్‌సిలో వైద్యం చేయించుకున్నారు.

నవరత్నాలతో పేదల ఇళ్లలో వెలుగులు

ప్రజాశక్తి - అమలాపురం

నవరత్నాలతో పేదల ఇంట్లో వెలుగులు ప్రసరిస్తున్నాయని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం ఆయన గోడి, గోడిలంక గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడేళ్లలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించామన్నారు. పార్టీలు, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. ఇళ్లస్థలాలు, గాగునీటి సమస్యలను పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. అర్హత ఉండి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ఇంటి స్థలం ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పినిపే శ్రీకాంత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తలకు గాయమైతే ...చెయ్యి తీసే వరకు తెచ్చారు..

-జిజిహెచ్ వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం అంటూ తల్లి తండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తలకు గాయమై ఆసుపత్రిలో చేరితే... ఇప్పుడు చెయ్యి తీసేయకపోతే ప్రాణానికే ప్రమాదంటని జిజిహెచ్ వైద్యులు అంటున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పెళ్లి అయి రెండు నెలలు కూడా కాలేదు.. నాకు ఈ అమ్మాయి వద్దు అని అత్తింటి నుంచి వార్త... వైద్యుల నిర్లక్ష్యానికి గారాబంగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు జీవితం ఇలా అయింది ఏంటి అంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ ఆ కుటుంబం ఇప్పుడు న్యాయం కోసం పోరాడుతోంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా బురద కోట, కొండపల్లి ఏజెన్సీ గ్రామానికి చెందిన బిత్తిరి రాజు, లక్ష్మి కుమార్తె దివ్య సంక్రాంతి సెలవులకు హాస్టల్ నుంచి తమ వారిని తీసుకురావడానికి ఉంభూరం మండలం వరిగు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం మీద నుంచి పడిపోగా తలకు గాయమైంది కాకినాడ జిజిహెచ్‌లో గత నెల 14న చేరింది. తలకు గాయం కావ డంతో ప్రమాదం ఏమీ లేదని చెప్పి మందులు వాడితే తగ్గిపోతుందని వైద్యులు తెలిపారు. అయితే చేతికి సెలైన్ పెడితే ఎక్కడం లేదని సిబ్బందికి చెప్పినప్పటికీ వినిపించుకోకుండా అలాగే వదిలేయడంతో చేతి వరకు ఉబ్బి పోయిందని తల్లిదండ్రులు అంటున్నారు. అయితే ఆ రోజే అదే చేతికి ఇంజక్షన్ చేయడంతో నొప్పి తట్టుకోలేక విలవిల్లాడిన దివ్య చెయ్యి మరుసటి రోజు పూర్తిగా నల్లగా మారిందని తల్లిదండ్రులు చెబుతు న్నారు. డాక్టర్లకు చూపించాలని అక్కడ నర్సులకు చెప్పగా, సెలవులు కావడంతో వైద్యులు లేరని సిబ్బంది నుంచి సమాధానం. తరువాత డాక్టర్ వచ్చి చూసి నీరు పట్టిందని ఏం పరవాలేదని, ఆపరేషన్ చేసి నీరు తీసేస్తామని చెప్పి, చేతిని కోసి అలాగే వదిలేశారన్నారు. తీరా చూస్తే ఇప్పుడు చెయ్యి తీసేయాలని, లేకపోతే ప్రాణానికి ప్రమాదం అని వైద్యులు అంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న బిత్తిరి దివ్య

డాల్ఫిన్‌కు పోస్టుమార్టం

ప్రజాశక్తి - పెదపూడి

ఏపీ తయారు రేవు బిక్కవోలు డ్రెయిన్లో గురువారం మధ్యాహ్నం చిక్కిన డాల్ఫిన్ చేపకు శుక్రవారం ఉదయం పోస్టుమార్టం చేసి, కాలువగట్టు పక్కన గొయ్యి తవ్వి పూడ్చిపెట్టారు. తహసీల్దార్ టి. సుబాష్, జిల్లా ఫారెస్ట్ అధికారి ఐ.వి.కె.రాజు తెలిపిన వివ రాల ప్రకారం పశుసంవర్ధకశాఖ, మత్స్య శాఖ, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల అధ్వర్యంలో డాల్ఫిన్ చేపకు పోస్టుమార్టం నిబంధనల ప్రకారం చేశారన్నారు. డాల్ఫిన్‌కు పశువైద్యులు ఫణీంద్ర, కిరణ్మయి, భరత్ పోస్టు మార్టం చేశారన్నారు. అయితే డాల్ఫిన్ ఉప్పు నీటిలో జీవిస్తుందని, బిక్కవోలు డ్రెయిన్‌లో ఉప్పు నీటి తియ్యటి నీరు, బురద తగల డంతో జీవించలేక పోయిందని వైద్యులు తెలిపారన్నారు. అనంతరం దానిని గొయ్యి తవ్వి దానిలో పెట్టి పూడ్చి వేశారన్నారు. విఆర్‌ఒ జె. అంబిబాబు, ఫారెస్ట్ అధికా రులు రవిరెడ్డి, ఉపేంద్రరెడ్డి, వసంతకుమారి, మత్స్యశాఖ ఎడిఓ నూకరాజు పాల్గొన్నారు.



డాల్ఫిన్‌కు పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యులు

'సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం'

కపిలేశ్వరపురం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. మండలములోని కాలేరులో శుక్రవారం నిర్వహించిన 2వ రోజు 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎంఎల్‌సి తోట పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు సూర్యనారాయణ, ఎంపిపి ఎం.సత్యవతి, ఎంపిటిసి సభ్యులు టేకి శ్రీసత్యమంజూ, వై.గంగరాజు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో సమన్వయం అవసరం

పెరవలి : అభివృద్ధి పనుల్లో సమన్వయం అవసరమని ఎంపిపి కార్నెడ్ల సీతారాం ప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు గ్రామాలకు వెళ్లేటప్పుడు స్థానిక ప్రజా ప్రతినిధులను కలుపుకుని ముందుకు వెళ్లాలని ఎంపిపి సూచించారు. ఎంపిడిఒ ఎస్.రమేష్ మాట్లాడుతూ అధికారులు సాధారణ సమావేశాలకు హాజరుకాకుంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కొమ్మిశెట్టి రామాంజిని, పంచాయతీ విస్తరణాధికారి పివిఎస్.నరసింహమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

ఉప్పలగుప్తం : బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని భీమేశ్వర లైటింగ్, టెంట్, సౌండ్, జనరేటర్స్ అసోసియేషన్ మండల సమావేశం విజ్ఞప్తి చేసింది. ఉప్పలగుప్తంలో శుక్రవారం అసోసియేషన్ మండల అధ్యక్షుడు చెప్పెడి దుర్గారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. తమ భద్రత కోసం ఆరోగ్య, జీవిత బీమా సదుపాయాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. వర్తి, వ్యాపారం నిమిత్తం కార్యక్రమాలు జరుపుకునేందుకు పోలీసుల నుంచి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి కె.నరేష్, సంయుక్త కార్యదర్శి శీలం ఈశ్వరరావు, నెల్లి సత్యనారాయణ, శీలం నాగబాబు, ఎరిపే శ్రీనివాసరావు, ఆదినారాయణమూర్తి, పలివెల రాంప్రసాద్ పాల్గొన్నారు.

'రాహుల్ నాయకత్వాన్ని బలపరుద్దాం..'

ఉప్పలగుప్తం : హాత్ సే హాత్ జోడో అభియాన్ చేయి కలుపుదాం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దామంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఎస్.యానాంలో గోడ పత్రికను విడుదల చేశారు. ఏఐసి ప్రత్యేక సూచనలతో ప్రతి ఇంటికి, కాంగ్రెస్ పార్టీ సాధించిన ఫలితాలు, ప్రాజెక్టులు, జాతీయ ప్రాజెక్టు, విభజన హామీలు రాహుల్‌గాంధీ వల్లే సాధ్యమని అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి అయితాబత్తుల సుభాషిణి అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యురాలు దొనిపాటి విజయలక్ష్మి, పార్టీ నాయకులు జోగి అర్జునరావు, గెద్దం సురేష్ బాబు, నిమ్మకాయల నాగేంద్ర ప్రసాద్, దామిశెట్టి జయ పాల్గొన్నారు.

దర్శకుడు విశ్వనాథ్ మృతికి మల్లిబాబు సంతాపం

ప్రజాశక్తి - మండపేట

కళాతపస్వి, సినీ దర్శకుడు కె.విశ్వనాథ్ మతి పట్ల తాపేశ్వరం సురుచి అధినేత పోలిశెట్టి మల్లిబాబు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాశ్చాత్య ఒరవడిలో కొట్టుకొ పోతున్న తెలుగు వారిని భాషా, సంస్కతుల పట్ల గౌరవం కలిగించే చిత్రాలతో మేల్కొలిపిన దార్శనికుడని కొనియాడారు. తాను విశ్వనాథ్‌ను తరచూ కలిసేవాడినని పేర్కొన్నారు. ఎంతో ప్రేమ ఆప్యాయంగా పలకరించే వారని గుర్తు చేసుకున్నారు. ఆయన మతి పట్ల సురుచి సిబ్బంది సంతాపం ప్రకటించారు.

పుంగనూరు ఆవుకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులో రైతు రెడ్డి సత్యనారాయణమూర్తి చెందిన పుంగనూరు ఆవుకు శుక్రవారం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆవు ఆకస్మికంగా శుక్రవారం మృత్యువాత పడింది. దీంతో స్థానిక సర్పంచ్ గుణ్ణం రాంబాబు సమక్షంలో ఆవుకు అంత్యక్రియలు నిర్వహించారు. ఆవు 14 ఈతలతో రికార్డు స్థాయిలో పలు గిత్తలకు, పెయ్యి దూడలకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఈ ఆవు గర్భం దాల్చి ఉందని రైతు తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పుంగనూరు ఆవుల అందాల పోటీలు, పాల దిగుబడి పోటీల్లో విజేతగా నిలిచిందని సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపిటిసి సభ్యులు యార్లగడ్డ రమేష్‌చౌదరి తెలిపారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేటలోని శ్రీనివాసపేటకు చెందిన సాకా ఆనంద్ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎంఎల్‌సి చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట జెడ్‌పిటిసి సభ్యులు గూడపాటి రమాదేవి, నాయకులు ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగింది. గౌరవ అధ్యక్షులుగా ఆర్.సూరిబాబు, ప్రెసిడెంట్‌గా మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శిగా రాయుడు వీరాస్వామినాథన్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.ప్రసాద్, గ్రెక్టార్, దుర్గా ప్రసాద్, ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, సంయుక్త సత్యనారాయణ, ట్రెజరర్ సిహెచ్.కృష్ణ, సబ్ ట్రెజరర్ కె.శ్రీను, జాయింట్ సెక్రటరీగా వి.బ్రహ్మజీ, సంఘ ముఖ్య సలహాదారులు బి.సత్తిబాబు ఎన్నికయ్యారు.

సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ షెడ్ల నిర్మాణం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కాల్దరి, పాలంగి గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ షెడ్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని ఇఒపిఆర్‌డి ముత్యం వీరాస్వామి నాయుడు తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యంగా ఉంచేందుకు ఈ షెడ్ల నిర్మాణం ప్రారంభించారన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణకు యూజర్ ఛార్జీలు చెల్లించి గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యవంతంగా మార్చాలని ఆయన కోరారు.

వైద్య శిబిరంలో కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవత శాఖ సహకారంతో, పరమహంస యోగానంద నేత్రాలయ సౌజన్యంతో వేలివెన్ను అయ్యప్ప స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నేత్రపరీక్ష శిబిరంలో 200 మందికి నేత్రపరీక్ష చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిలో 22 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. 80 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.